

ఆరోగ్య కేంద్రం ప్రారంభం

నెల్లూరు :రూరల్ నియోజకవర్గ పరిధిలోని 36వ డివిజన్, రామయ్య బడి ఏరియాలో షుమారు రూ.110 లక్షల రూపాయల నిధులతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం నిర్వహించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ గత 35 ఏళ్లుగా తనకు స్నేహితుడని తెలిపారు. రూరల్ లో మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు వారి సహాయ సహకారాలు తీసుకుం టానన్నారు. నగర కమిషనర్ సూర్య తేజ, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజా నాయుడు ,డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్,నాయకులు ఊరందూరు సురేంద్ర బాబు, అబ్దుల్ రసూల్, పూడి ఆనంద్, మునీర్, శశిధర్, చెంగలపట్టు శేఖర్, కుమార్ హరి కుమార్, అబూబకర్, ధనుంజయ, షణ్ముగం ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

టిడిపి,జనసేనలో నామినేటెడ్ లొల్లి..!

- 30శాతం జనసేన,10శాతం బిజెపివాట
- టిడిపికి 60 శాతం
- పదవుల కోసం తమ్ముళ్లు తహతహ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పదవులు కోసం టిడిపి, జనసేన, బిజెపి నేతలు తహతహలాడుతున్నారు. అధికారంలోకి వస్తే ఏదొక పదవి వస్తుందని ఆశపడ్డ టిడిపి నేతలకు నిరాశే మిగులుతోంది. రాష్ట స్థాయిలో కూటమి ప్రభుత్వం ఎంఎల్‌సిలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లోనూ వాటాలు వేసుకుంటుంది. ఇందులో టిడిపికి 60 శాతం, జనసేనకు 30, బిజెపికి 10 శాతం పంపకాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జిల్లాలో ప్రస్తుతం ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్, నుడా ఛైర్మన్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్లు పదవు లున్నాయి. వివిధ దేవాలయాల కమిటీలున్నాయి. వీటిలో దామాషా పద్ధతుల్లో పంపకాలు చేయాల్సి ఉంది. టిడిపి నేతలు పదవుల కోసం పోటీ ఎక్కువైంది. జనసేనకు నాయకులు కరువుగా కనిపిస్తున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి, అధికారంలోకి వచ్చినా ఆపార్టీ నేతల్లో సంతృప్తి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలు గెలిచినా అందరిలో అంసతృప్తి కనిపిస్తోంది. ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోంది. రాష్ట్ర కూటమి నాయకత్వం ఓ నిర్ణయం ప్రకారం టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్న చోట ఆపార్టీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బిజెపికి 10 శాతం ఇవ్వాలని సూచన ప్రాయంగా చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబందించి ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్ ఉంది. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్, నుడా ఛైర్మన్ మూడు కీలకమైన పదవులున్నాయి. దీనికోసం టిడిపిలో పోటీ నెలకొంది. నుడా ఛైర్మన్‌గా మళ్లీ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అవకాశం ఇస్తారని ప్రచారం సాగుతోంది. రెండు పదవులకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోటీ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించినా చివరి క్షణంలో వైసిపి నుంచి వచ్చిన నేతలకు సర్దుబాటు చేశారు. ఎంఎల్‌సి సీటుకోసం తీవ్రమైె పోటీ నెలకొంది. మాజీ ఎంఎల్‌సి బీద రవిచంద్ర, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, వరుస క్రమంలో ఉన్నారు. ఆపార్టీలో ఎందరో ముఖ్యనేతలు జిల్లా వ్యాపితంగా పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ, ఎంఎల్‌ఎలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని రామారావు, కోవూరు నుంచి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరులో డాక్టర్ జెడ్ శివప్రసాద్, తమకు ఏదైనా పదవి దక్కుతుందని చూస్తున్నారు. ఇప్పుడు జిల్లా స్థాయిలో నామినేటేడ్ పోస్టులకు ఆ పార్టీ నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఇవి ఎవరికి దక్కుతాయో చూడాలి. రాజరాజేశ్వరి దేవాలయ కమిటీ, ఇరుకళల దేవాలయ కమిటీ, రంగనాయకులు దేవాలయం, నరసింహకొండ దేవాలయం ఇలా అనేక కమిటీలున్నాయి. ఇవి ఆయా నియోజకవర్గానికి చెందిన వ్యక్తులకు దక్కనున్నాయి. టిడిపిలోని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే క్రమంలో జనసేన నేతలు తమ వాటా పైనా ఆశలు పెట్టుకుంటున్నారు. గతంలో నెల్లూరు నగరం నుంచి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నుంచి మనుక్రాంత్‌రెడ్డి పార్టీలో కీలకంగా ఉండి,. ఎంఎల్‌ఎలుగా పోటీచేశారు. చివరి క్షణంలో వినోద్‌రెడ్డి టిడిపిలోనూ, మనుక్రాంత్‌రెడ్డి వైసిపిలోనూ చేరారు. ఇప్పుడు ఆపార్టీలో ముఖ్యనేతలు పెద్దగా కనిపించడం లేదు. జనసేనలో గునుకుల కిషోర్, జి. సుజయ్ ఉన్నప్పటికీ పెద్ద స్థాయినేతలుగా కనిపించడం లేదు. ఇటీవల టిడిపి, వైసిపిలో పనిచేసిన నూనె మల్లికార్జునయాదవ్ పార్టీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ ముగ్గురు నేతలు మాత్రమే ఆపార్టీలో కనిపిస్తున్నారు. ఆపార్టీలో నాయకత్వం బలహీనంగా కనిపిస్తోంది. 30 శాతం ఆపార్టీకి ఇచ్చినా మూడు ఛైర్మన్ స్థానాల్లో ఒక్కటి ఆపార్టీకి ఇవ్వాల్సి ఉంటుంది. బిజేపి పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. నామినేటెడ్ పదవుల పందేరంలో నేతలు కుర్చుంటే ఏ సమస్య వస్తుందోనని ఆచీ తూచీ అడుగులేస్తున్నారు. మూడు పార్టీల్లో నామినేటెడ్ లొల్లిసాగుతోంది. మా కంటే మాకు అంటున్నా, అందరిలో నిరాశ కనిపిస్తోంది.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న రూ.4వేలు పింఛన్‌ను 1వ తేదీనే అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. పింఛన్ల పంపిణీని కేవలం రెండురోజుల్లోనే నూరుశాతం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందని, ఈ మేరకు సంబంధిత అధికారులందరికి పింఛన్ల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆగస్టు 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి అధికారులు పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తామన్నారు. తొలిరోజే 99శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందించాలని ఆదేశాలిచ్చామని చెప్పారు. 1, 2వ తేదీల్లోగా ఎట్టిపరిస్థితిల్లో నూటికి నూరుశాతం పింఛన్లను అందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

3,11,535 మందికి రూ.131.68 కోట్లు

జిల్లాలో ఆగస్టు 1వ తేదీన 3,11,535మంది పలు రకాల పింఛన్ లబ్ధిదారులకు చెల్లించేందుకు రూ.131.68 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి తెలిపారు.

సాంబశివారెడ్డి, పీడీ

విద్యార్థి మృతి బాధాకరం..

ప్రజాశక్తి-నెల్లూరు

ఇటీవల కెవిఎన్‌ఆర్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న గురు మహేష్ మృతి చెందడం బాధాకరమని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఎంత చేసినా తక్కువే అవుతుందని రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మతిచెందిన గురు మహేష్ నివాసానికి చేరుకున్న ఆయన విద్యార్థి కుటుంబ సభ్యులను ఓదార్చి , తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల రూపాయల పరిహారాన్ని చెక్కు రూపంలో అందజేశారు. విద్యార్థి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి స్పందించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు పరిహారంగా ప్రకటించారన్నారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి నివాసస్థలం కేటాయించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారుజరిగిన సంఘటన మీద కలెక్టర్ స్పందించి విచారణకు ఒక కమిటి వేశారని, ఆ కమిటీ విచారణ జరిపి, మానవ తప్పిదం అయివుంటే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగర కమిషనర్ సూర్యతేజ, పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ

రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

తెగుళ్ల నివారణకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :వరిని ఆశిస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మంగళవారం ఆత్మ డిపిడి శివన్నారాయణ, సహాయ వ్యవసాయ సం చాలకులు ఎ. రాజ్ కుమార్, వ్యవసాయ అధి కారి వివి శిరీష రాణి మం డలంలోని పేడూరులో వి పొలాలను పరిశీలించారు. వరిని ఆకు నల్లి, కంకి నల్లి తెగుళ్ల సోకుతు న్నాయన్నారు. వివిధ రకాల తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. ఏ ఇఒ హరిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్. డి షర్మిల, శివకుమార్, వినీల్, నిరీషా రైతులు పాల్గొన్నారు.

కందుకూరు పట్టణ ఎస్‌ఐగా ఎడ్వర్డ్

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ నూతన ఎస్.ఐ.గా ఎడ్వర్డ్ నియమితులయ్యారు. నెల్లూరు వి.ఆర్‌లో ఉన్న 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఎస్‌పి కష్ణ కాంత్ మంగళవారం పోస్టింగులిచ్చారు. . ఇందులో భాగంగా కందుకూరు నియోజక వర్గం లోని కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇనస్పెక్టర్‌గా కె ఎడ్వర్డ్, వలేటివారిపాలెం ఎస్‌ఐగా ఎల్.రాములును నియమించారు. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ కామాక్షి సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహి ంచారు. ఆలయ అర్చకులు అన్నమాచార్యులు అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని తిమ్మారెడ్డి పాలెం పంచాయితీలో సైడ్ కాలువల్లో పూడిత తీత పనులను మంగళవారం చేపట్టారు. ఈ పనులను మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీని వాసులు పరిశీలిం చారు.గ్రామంలో సైడ్ కాలువల ద్వారా మురుగు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చేయాలన్నారు బ్లీచింగ్ చల్లి, పారిశుద్ధ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ గౌస్ ఉన్నారు.

కందుకూరుకు కృష్ణా జలాలు

సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హామీ - ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కందుకూరు

వెలుగొండ ప్రాజెక్టు తూర్పు కాలువ నుంచి కందుకూరు నియోజకవర్గానికి కృష్ణా జలాలను తెచ్చే ప్రతిపాదనకు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ స్పందించి స్పష్టమైన హామీనిచ్చారని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఎంఎల్‌ఎకు ఇంటూరి నాగేశ్వరరావుకు కందుకూరు మండలం, మోపాడు గ్రామస్తులు మంగళవారం ఆత్మీయ సన్మానం చేశారు. గ్రామ టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్ర మానికి తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామంలోని సాయిబాబా ఆలయం నుంచి రామాల యం వరకు తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎంఎల్‌ఎను సన్మానించారు. చివరిగా పోలేరమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగు, తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న వెనుకబడ్డ కందుకూరు నియోజకవర్గ అభివద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వెలిగొండ ప్రాజెక్ట్ తూర్పు కాలువ నుంచి, ప్రత్యేక కాలువ ఏర్పాటు ద్వారా కందుకూరు నియోజకవర్గానికి కృష్ణా జలాలను తీసుకువచ్చేలా దాదాపు రూ. 350 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. కనిగిరి, కందుకూరు, కొండపి నియోజకవర్గాలకు మేలు చేసే ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి లోకేష్‌లకు వివరించగా వారు స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. 11 సీట్లు వచ్చినా జగన్మోహన్‌రెడ్డికి సిగ్గు రాలేదని విమర్శిం చారు. మొదటినుంచి మోపాడు గ్రామం టిడిపిని ఆదరిస్తోందని, ఈమధ్య ఎన్నికల్లో 274 ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు గ్రామస్తులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నానని నాగేశ్వరరావు తెలిపారు. పలు సమస్యల గురించి గ్రామస్తులు ప్రస్తావించగా, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు నార్నే రోశయ్య, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోకల వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రావుల రవి, పార్టీ నాయకులు తోకల నరసింహం, వీరయ్య, నాగినేని సురేష్, బొడపాటి నరసింహారావు, తన్నీరు ఏడుకొండలు, బొడపాటి నారాయణ ఉన్నారు.



ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

జర్నలిస్టు భవన్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక ఆచారివీధి లో మంగళవారం నూతన జర్నలిస్ట్ భవన్(ప్రెస్ క్లబ్)ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రెస్ క్లబ్ ప్రారం తొలుత ఈ ప్రారంభోత్సవంలో వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఏసీ సుబ్బారెడ్డి,షైక్ రసూల్ 36 డివిజన్ ఇన్‌ఛార్జి పిట్టి సత్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కొటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సమ స్యను మంత్రి మంత్రి నారాయణతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. జర్నలిస్టులకు అందా ల్సిన అన్ని సదుపాయాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే జిల్లాలో ఒక శాశ్వతమైన ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కషి చేస్తా మన్నారు. మదీనా వాచ్ కంపెనీ ఇంతియాజ్, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడారు. డిప్యూటీ డైరెక్టర్ సదారావు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

డాక్టర్ అజయ్‌కుమార్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-నెల్లూరు :డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సీనియర్ వైద్యులు డాక్టరు పరుచూరి అజయ్ కుమార్ తల్లి చిగురుపాటి నాగశిరోమణి కన్నుమూశారు. నగరంలోని ఆదిత్యానగర్ ప్రాంతంలోని డాక్టర్ అజయ్‌కుమార్ నివాసంలో ఆయన తల్లి చిగురుపాటి నాగశిరోమణి(88) వయోభారంతో మృతిచెందారు. డాక్టరు అజయ్‌కుమార్ తండ్రి పరుచూరి నాగేశ్వరరావు ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, తెనాలి తాలూకా కార్యదర్శిగా పనిచేసి అమరులయ్యారు. డాక్టరు అజయ్‌కుమార్ తల్లి విశ్రాంత ఉపాధ్యాయురాలు. ఆమె జీవిత చివర దశ వరకు భర్త పరుచూరి నాగేశ్వరరావు, కుమారుడు అజయ్‌కుమార్ ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించారు. సిపిఎం సాను భూతిపరురాలిగా వ్యవహరించారు. డాక్టర్ అజయ్‌కుమార్ తల్లి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ చిగురుపాటి నాగశిరోమణి భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నేటి ఉదయం 10 గంటలకు తెనాలిలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. నాగశిరోమణికి నివాళి అర్పించినవారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, 16వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల వైద్యులు, సిబ్బంది, పలువురు జిల్లా కమిటీ సభ్యులు, డాక్టరు జెట్టి శేషారెడ్డి ట్రస్టు బాధ్యులు,యువజన సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు, పార్టీ అభిమానులు ఉన్నారు.

పరుచూరి నాగశిరోమణి (ఫైల్)

మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎన్‌సిఒఆర్‌డి సమన్వయ సమావేశాన్ని ఎస్‌పి జి.కృష్ణకాంత్ అధ్యక్షత నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను సర్వనాశనం చేసుకుం టున్నార న్నారు. కుటుంబాలు ఆర్థికంగా విచ్ఛిన్నం అయ్యేందుకు పరోక్షంగా కారణమ వుతున్నా యన్నారు. జిల్లాలో హాస్టళ్లు, జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో అవ గాహన కార్యక్ర మాలను నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఎస్‌పి కృష్ణ కాంత్ మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకోని జిల్లాలో గంజాయి ఉత్పత్తి ఎక్కడా లేకుండా నిఘా ఏర్పాటు చేయాలని, మాదకద్ర వ్యాలను విక్రయించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది బస్‌స్టేషన్‌ల వద్ద, రైల్వే స్టేషన్స్ వద్ద, ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి పిలుపు నిచ్చారు. ఎన్‌సిఒఆర్‌డి కమిటీ స్టేక్ హెూల్డర్స్ పలు సలహాలు, సూచనలు చేశారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య , ఎస్‌ఈబి ఈఎస్ కె.బాబు శ్రీధర్ , డిఎంహెచ్‌ఓ డాక్టరు పెంచలయ్య, జిల్లా ఎస్‌సి వెల్ఫేర్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రామరావు, టెర్రీటోరియల్ ఫారెస్ట్ ఆఫీసర్, కందుకూరు సబ్ కలెక్టర్ , అగ్రికల్చర్ జెడి, జాయింట్ కమీషనర్ కమర్షియల్ ట్యాక్స్, ఇండియన్ కోస్ట్ గార్డ్ కమాండెంట్, ఆర్‌డిఒ, కృష్ణపట్నం పోర్టు సిఈఒ, ఇంటలిజెన్స్ అధికారులు, జిల్లా సెబ్ అధికారులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-నెల్లూరు :విద్యుత్ బకాయిలు ఉన్నారంటూ ఎస్‌ఎంఎస్ పంపించి డబ్బులు దోచుకునే ఆన్ లైన్ ముఠాలపై విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వి.విజయన్ తెలిపారు. జిల్లాలోని అధికారులను కూడా అప్రమత్తం చేశామని, అలాగే వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

3న విద్యుత్ వినియోగదారుల సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు :ఆగస్టు 3న విద్యుత్ భవన్ లోని స్కాడా బిల్డింగ్‌లో జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు(హెచ్.టి) సమావేశం జరుగుతుందని జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ వి.విజయన్ తెలిపారు. హెచ్.టి.వినియోగదారులకు విద్యుత్ బిల్లులపై ఏవైనా సమస్యలు ఉన్నా, సరఫరా లో ఏవైనా సమస్యలు ఉన్న తెలియచేయవచ్చని తెలిపారు. జిల్లాలోని హెచ్.టి.వినియోగదారులు పాల్గొనాలని కోరారు.

మాతా శిశుమరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో పనిచేస్తున్న ఆశా నోడల్ అధికారులు మాతా, శిశుమరణాల నియంత్రణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు ఎం.పెంచలయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం నగరంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులకు 'కిల్కారి' మొబైల్ అకాడమి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎంహెచ్ఓ డాక్టరు ఎం.పెంచలయ్య మాటా ్లడుతూ వాయిస్ కాల్స్ సేవలతో మాతా శిశు ఆరో గ్యానికి భద్రత, గర్భిణీలు, బాలి ంతలు, శిశువుల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిం దన్నారు. గర్భిణీలు, బాలింతలు తీసు కోవాల్సిన జాగ్రత్తల తోపాటు ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేయాల్సి ఉందన్నారు. ఎల్‌డి రవీంద్ర, నేషనల్ టీం ఆర్‌సిహెచ్ కన్సల్టెంట్ శ్రీలంకపల్లి రాజు, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ. ఉమామహేశ్వరి, కె.కీర్తి, బి.శ్రీనివాసులు, కె.కనకరత్నం, బి.రమేష్, జి.మంజుల, కె.సునీత ఉన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

నూతనంగా ఎన్నికైన 'హంస' కార్యవర్గం సభ్యులు

'హంస' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు జిల్లా ప్రభుత్వం వైద్యశాలలో మంగళవారం హంస నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్ సూచనల మేరకు ఎపి హంస ఆత్మకూరు తాలూకా నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమలాకర్‌బాబు ఆత్మకూరులోని జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జలీల్‌అహ్మద్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఆత్మకూరు తాలూకా ఎపి హంస తాలూకా అధ్యక్షులుగా వి.శ్రీనివాసరావు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జిల్లా హాస్పిటల్ ఆత్మకూరు వారు వి.జ్యోతి పబ్లిక్ హెల్త్ నర్స్ చిరమన పిహెచ్‌సి, సలోమి హెల్త్ సూపర్‌వైజర్ – తాలూకా ట్రెజరర్, అసోసియేట్ ప్రెసిడెంట్– ఎన్‌డి మున్వర్ సుల్తాన్, మంజులమ్మ – ఆర్గనైజింగ్ సెక్రెటరీ, వి ధనకుమారి– పబ్లిసిటీ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్లు 1. ఎ.పుష్ప, పి.సింధూర, సిహెచ్.శిరీష, జె నాగరాజు, జె వెంకట్రావు, మహిళా వింగ్ సెక్రెటరీ ఎన్.జయంతి తాలూకా జాయింట్ సెక్రెటరీలు డి.మస్తాన్‌బీ, సిహెచ్ నాగమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా నూతన కార్యవర్గం ద్వారా ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శేషారత్నం, ఆర్ఎంఒ డాక్టర్ బి.ఉషాసుందరి అభినందనలు తెలియజేశారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఎపి హంస రిక్విజిట్ యూనియన్ ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జిల్లా హాస్పిటల్ ఆత్మకూరు డాక్టర్లు అందరినీ ఘనంగా జిల్లా హంస నాయకత్వం అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.మునిశ్వర్, డాక్టర్ పివి నరసింహ శాస్త్రి, డాక్టర్ సి.ఎస్ కుమార్, డాక్టర్ రామ్‌నాథ్ రెడ్డి, డాక్టర్ దత్త ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, ఎపి హంస ఉదయగిరి తాలూకా ప్రెసిడెంట్ వెంకటసుబ్బయ్య తాలూకా సెక్రటరీ నౌషద్, ఆత్మకూరు తాలూకా పరిధిలోని పలు ఉద్యోగ సంఘ నాయకులు, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థుల కోసం "స్టూడెంట్ అకడమిక్ ఎన్రిచ్‌మెంట్ ప్రోగ్రామ్"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సెల్ఫ్ ఫైనాన్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి అధ్యక్షత వహించి, కళాశాల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొని, కళాశాల విద్యార్థుల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అకడమిక్ అడ్వైజర్, మెంటార్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ జె.కృష్ణ ప్రసాద్ బాబు స్టూడెంట్ ఎన్రిచ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తూ, విద్యార్థులకు కేవలం సిలబస్‌ను బోధించడమే కాకుండా వారికి వారాంతపు పరీక్షలు, సెమినార్లు నిర్వహించడం, వ్యాసరచన పోటీలు మొదలగు అంశాలలో శిక్షణను అందించి పోటీలను నిర్వహించడం, ప్రత్యేక ప్రణాళిక ద్వారా పోటీ పరీక్షలకు శిక్షణ అందించడమే కాకుండా సందేహాల నివృత్తికి ప్రత్యేకంగా విద్యార్థులను ఉత్తేజపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టి, తద్వారా విద్యార్థులను సమగ్రమైన జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దానికి విద్యార్థులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు. సెల్ఫ్ ఫైనాన్స్ డిప్యూటీ డైరెక్టర్ టి వి రమణ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రశాంతగా ముగిసింది. ఈ సమావేశానికి పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మండల కన్వీనర్ చంద్ర మధుసూదాన్ రావు, టిడిపి నాయకులు, అధికాతులతో కలిసి ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు, ఉపముఖమంత్రి పవన్‌కళ్యాణ్, ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ వెంకయ్య, జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, వైస్ ఎంపిపి మధు, ఎంపిడిఒ తోట వెంకటకుమారి, టిడిపి నాయకులు ముజ్జె లక్ష్మీనారాయణ, పేరం సుధాకర్‌రెడ్డి, పాలకొల్లు భాస్కర్‌రెడ్డి, మాలెం హజరత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, తెల్లగొర్ల వెంకటయ్య, తాతపూడి లాబాన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య సేవలు

ప్రజాశక్తి-ఉదయగిరి : గండిపాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకల్పన పాల్గొని రెండవ రోజు వైద్య సేవలను కొనసాగించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని పూసల కాలనీలో ఆమె వైద్యశిబిరం నిర్వహించి 30మందికి చిరు వ్యాధులకు చికిత్సను ఆశా కార్యకర్తలు ఆరోగ్య సహాయకులతో అందించారు. సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి జ్వరం కేసులపై ప్రత్యేకసర్వే చేపట్టగా జ్వరం నమోదు కాకపోవడంతో ప్రజలందరికీ డెంగీ, చికున్‌గున్యా, కామెర్లు, టైఫాయిడ్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శివకుమారి సిహెచ్‌ఒ ఆరోగ్య వైద్యాధికారి కలసపాటి. వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌసద్ బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, ఆరోగ్య సహాయకులు అసహనయ, రబ్బాని, శ్రీనివాసులు, జి శ్రీనివాసులు, మంచు రవి, చంద్రమౌళి, ఎఎన్‌ఎం నూర్జహాన్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం వైకుంఠపురం క్వాలిటీ చికెన్ సెంటర్ ప్రొప్రైటర్ పి వి రమణయ్య – లీల దంపతుల కుమారుడు పి వి శ్రుహాన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా బాలక్రిష్ణారెడ్డి నగర్లో నివాసం ఉంటున్న గిరిజనులకు, జంగాల కాలనీలోని పేదలకు భోజన ప్యాకెట్లు వితరణ చేయించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ కుమారుడు పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఒక పూటైన ఆకలి తీర్చడం గొప్ప విషయమని తెలిపారు. పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయించిన దాతలు పి.వి. రమణయ్య – లీల దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఆంజనేయస్వామి ఊరేగింపులో ఇబ్బందులు తలెత్తకుండా విజయంతం చేసిన పోలీసు శాఖ, విద్యుత్ శాఖ అధికారులను మంగళవారం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. డి.ఎస్.పి. కోటారెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.జనార్ధన్, ఎడిఇ సురేష్‌లను వారి కార్యాలయాలకు వెళ్ళి సన్మానించారు.

మతోన్మాద రాజకీయాలను అరికట్టాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టే చర్యలు వల్ల దేశంలో మతోన్మాద రాజకీయాలు చెలరేగుతున్నాయని, వాటిని ప్రజలే అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలగా శివరామ సుబ్బయ్య భవన్ (సిపిఎం కార్యాలయం)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా రాజకీయాలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ మత విశ్వాసాలు, మూఢనమ్మకాలతో పేదలు ప్రధానంగా కూలీలపై ప్రభావం చూపి ఆర్థికంగా బాధలు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే చర్యలతో మత సామరస్యం దెబ్బతిని ప్రజల మధ్య విద్వేషాలు పెరుగుతున్నాయని తెలిపారు. కులతత్వం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు బాగా నలిగిపోతున్నారని, అలాగే వ్యవసాయ కూలీలకు పనులు లేక వలసలు పోతున్నారన్నారు. పేదలకు కూలీలకు ఆసరాగా ఉన్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి, నిధులు తగ్గించి పేదల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. అలాగే వ్యవసాయానికి, విద్య, వైద్యానికి కూడా నిధులు తగ్గించి, పేదలకు విద్య, వైద్యాన్ని కూడా దూరం చేస్తుందన్నారు. వ్యవసాయానికి బడ్జెట్ రెండున్నర లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా, మోడీ ప్రభుత్వం కేవలం రూ.86 వేలకోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ధరలు విపరీతంగా పెరుగుతూ, ధరల కొరల్లో చిక్కుకుని పేదలు అల్లాడి పోతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం అదుపులో పెట్టకుండా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర ఇవ్వాలని పోరాడు తుంటే పట్టించుకోవడం లేదన్నారు. మోడీ గద్దెనెక్కిన తర్వాత 14 లక్షల కోట్ల రూపాయలు అంబానీ, అదానీ, తదితర కార్పొరేట్లకు రాయితీలు కల్పించారన్నారు. ఈ నేపథ్యంలో పేదలపై పన్నుల భారం మోపుతున్నారన్నారు. దేశవ్యాప్త ఉద్యమాల్లో భాగంగా, వ్యవసాయ కార్మిక సంఘం కూడా మోడీ, మతతత్వ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేవిధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా పోరాటాల గడ్డ అని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికుల జీవనాధారమైన ఉపాధిహామీ చట్టంలో 200రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. రూ.600 కనీస వేతనం ఇవ్వాలన్నారు. వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరు వెంకమరాజు, మంగళ పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, దేవకుమారి, బెల్లంకొండ నాగయ్య, సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వ్యకాస జిల్లా నాయకులు బట్ట పెద్దబ్బయ్య, మొడేగుంట రామచంద్రయ్య, నక్క రాధయ్య, కాంతారావు, రాధాకృష్ణయ్య, ఆంథోని, జి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం మోడల్ స్కూల్లో శుభతిథి భోజన కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయురాలు కళావాణి, ఉపాధ్యాయులు, ఇతర దాతల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దాతల సహకారంతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అదనపు ఆహార పదార్థాలను అందించడం మంచి కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ–2 ధనలక్ష్మి, సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు వడవల నాగేశ్వరరావు, ఎంఆర్‌జి రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మరుబోయిన రాజా

సిఐటియు సమావేశాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఆగస్టు 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆటో యూనియన్ అధ్యక్షులు మరుబోయిన రాజా పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గంగపట్నం గ్రామంలో ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మరుబోయిన రాజా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకం బ్యాడ్జీతో నిమిత్తం లేకుండా, లైసెన్సు ఉన్న ప్రతిఒక్క డ్రైవర్లకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 16, 17, 18 తేదీలలో నెల్లూరు నగరంలో జరిగే సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బహిరంగ సభకు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షులు దయాసాగర్, మైపాడు ఆటోస్టాండ్ అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, బర్రె ప్రసాద్, సహాయ కార్యదర్శి అశోక్, ట్రెజరర్ శ్యామ్, కమిటీ మెంబర్స్ శ్రీనివాసులు, మస్తానయ్య, రామయ్య, మోహన్, మహేష్, మురళి, హరిబాబు, నజీర్, అంకయ్య, హరిబాబు, శ్రవణ్, అబ్రహం, బాబు, చంద్ర, ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ డి.రవీంద్ర

ఇన్సూరెన్స్‌లపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, జీవనజ్యోతి సురక్ష యోజన పథకాలను ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర అన్నారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రదీప్‌కుమార్, పలు బ్యాంకుల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–49 సంవత్సరాల వయస్సు వారికి ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన స్కీమ్, 18–70 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ప్రధానమంత్రి జీవన జ్యోతి సురక్ష యోజన పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పిఎం జీవనజ్యోతి యోజన స్కీమ్ కింద సంవత్సరానికి రూ.436 కడితే రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని, ఇది సహజ మరణమైన, ప్రమాదమరణమైన వర్తిస్తుందన్నారు. అదేవిధంగా పిఎం జీవనజ్యోతి సురక్ష యోజన పథకం కింద రూ.20 కడితే ప్రమాద మరణం సంభవిస్తే రూ.2లక్షలు పరిహారం అందుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ అకౌంట్లలో కనీస బ్యాలెన్స్ ఉంచుకోవాలని కోరారు. ఆర్‌పిలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌ఒబిలు ఇంటింటికి తిరిగి అర్హులైన వారిని ఈ పథకంలో చేర్పిస్తారని ఇవి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిపిఎం సురేంద్రబాబు, సిఎంఎం అంకయ్య, సిఒ మాధవి, ఆర్‌పిలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌ఒబిలు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం చిత్రపటం అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఆళహరి సుధాకర్ ఆదేశాల మేరకు నాయకులు పట్టణ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలు లేనందున, మంగళవారం జనసేనాని, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్రపటాలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు తిరుమలశెట్టి సుధీర్ మాట్లాడుతూ ఎపి ప్రభుత్వరంగ సంస్థలలో డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్రపటాలు లేకపోతే వెంటనే పెట్టాలన్నారు. కార్యక్రమంలో కావలి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, సూరిపోగు రాజేష్, ఐటి కో–ఆర్డినేటర్ పసుపులేటి బాలు, ఇమ్మాన్యుల్, పొక్కల రఘువర్మ, బెల్లంకొండ మస్తాన్ బాబు, బొమ్మల ఆగష్టిన్, జనసైనికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కోవూరు

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారికి, మండల రెవెన్యూ అధికారికి యుటిఎఫ్ మండల శాఖ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస ప్రసాద్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ప్రాథమిక విద్య పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు దూరమైందని ప్రయివేటు విద్యను ప్రోత్సహించే విధంగా ఉందన్నారు. విలీనం రద్దుచేసి ప్రాథమిక విద్య ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండే విధంగానూ, మాతృభాషలో విద్యనభ్యసించే విధంగానూ, తెలుగు ఇంగ్లీషు రెండు మీడియాల్లో పిల్లల చదువుకునే అవకాశం ఉండేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, జిల్లా కార్యదర్శి భారతి, మండల అసోసియేట్ అధ్యక్షులు సుబ్బారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు గేట్ ఏర్పాటు

ప్రజాశక్తి-బిట్రగుంట

పాఠశాల గేట్ ప్రారంభిస్తున్న ఎంఇఒలు

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పసుపులేటి హర్ష భరత్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు పసుపులేటి లక్ష్మి సాయిబాబా ఏర్పాటు చేసిన గ్రిల్ గేటును మంగళవారం ఎంఇఒలు పి ఎల్ నరసింహారావు, జయమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు ఏర్పాటుకు స్థానికులు లక్ష్మీ సాయిబాబాలు తమ కుమారుడు జ్ఞాపకార్థం ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాబోధన అందించడం జరుగుతున్నదని తెలియజేశారు. విశ్వనాథరావుపేట పంచాయతీ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో విజ్ఞానవంతమైన విద్యాబోధన అందిస్తున్నామని, అందుకు నిదర్శనంగా తమ కళాశాల నుండి ఇద్దర ఎంసెట్ పరీక్షలు రాయగా వారిద్దరికీ అగ్రికల్చర్ బిఎస్‌సికి ఎంపికయ్యారని తెలియజేశారు. తమ కళాశాలలో పాఠ్యాంశాలతో పాటు ఎంసెట్ ఉత్తీర్ణులయ్యే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కొండ బిట్రగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, చెంచులక్ష్మీపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, కొత్తూరు పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద, సహోపాధ్యాయిని విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహశీల్దారును సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి -వరికుంటపాడు

ఎన్నికల విధులలో భాగంగా బదిలీపై వరికుంటపాడు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్ అరుణదేవి ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు తిరిగి ఎక్కడి నుంచి వచ్చారో అదే మంగళగిరి సిఆర్‌డిఎ విజయవాడకు బదిలీపై వెళు న్న సందర్భంగా మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆమెను విఆర్‌ఒలు, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఆధ్వర్యంలో శాలువా, పూలమాల వేసి ఘనంగా వీడ్కోలు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-జలదంకి

జలదంకి ఆరోగ్యశాఖ కేంద్రం పరిధిలోని చామదల గ్రామంలో జెడ్‌పి పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు డెంగీ నివారణపైన సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనరసయ్య అవగాహన కల్పించారు. మురుగునీరు, మంచినీటి నిల్వలలో మలేరియా, డెంగీ, బోధకాలు, మెదడు వాపును కలుగచేసే దోమలు పెరిగి వ్యాధులను కలుగజేస్తున్నాయన్నారు. వారానికి ఒకసారి వాటిని శుభ్రపరచు కొని, ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటిస్తే దోమకాటు ద్వారా వచ్చే విష జ్వరాలను అరికట్టవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా నీళ్ల విరేచనాలు కాకుండా చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు మల్యాద్రి, సలీం, ఆరోగ్య కార్యకర్త షాహిద, ఆశ కార్యకర్తలు తిరుపతమ్మ, నాగమణి, పద్మావతి, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అడవిరాజుపాలెం బైపాస్ రోడ్డు కూడలిలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయిప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ వాడకం పక్షోత్సవాలలో భాగంగా కార్యక్రమును నిర్వహించారు. వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వాడకం వల్ల ప్రాణ రక్షణ, తలకు గాయాలు వంటి వాటిని రక్షించుకోవచ్చని, అలా బైక్‌లపై వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని లేనియెడల జరిమానా విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చంద్రశేఖర్ రెడ్డి, సాయిక్రిష్ణ, లోక్‌అదాలత్ మెంబర్ ఎం.మాలకొండా రెడ్డి, బైక్‌రైడర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వంటశాలలో పరిశీలిస్తున్న డాక్టర్ అస్మా

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాలను అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ అస్మా, సిబ్బందితో కలిసి మంగళవారం హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాలను పరిశీలించి సిబ్బందికి స్వచ్ఛతపై తగిన సూచనలు అందజేశారు. చేతులు పరిశుభ్రత, తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు తాజాగా వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే అందించాలని సూచించారు. తాగునీరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ నీళ్లు, ఆర్‌ఒ నీళ్లు తాగాలని సూచించారు. మరుగుదొడ్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు వాటిని శుభ్రపరచాలన్నారు. పిల్లలకు ఎటువంటి అనారోగ్యానికి గురైన వెంటనే దగ్గరలోని అర్బన్ పిహెచ్‌సి కేంద్రానికి పంపించాలని, వసతి గృహాల్లో కిటికిలు మేష్‌లు లేవని, ఉన్నవి కూడా ఊడిపోయేలా ఉన్నాయని, అధికారులతో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ ఎస్.సుధాకర్, ఎఎన్‌ఎం షేక్ బీబీజాన్, షేక్ నూర్జాహాన్, ఆశాలు అనిత, వరలక్ష్మి, వార్డెన్లు పాల్గొన్నారు.

డయేరియా నివారణ మాసోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

డయేరియా, డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని రామస్వామిపల్లి గ్రామంలో మహిమలూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దేవానంద్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా లార్వా సర్వే నిర్వహించారు. జ్వర పీడుతులు ఎవరైనా ఉన్నారా అని పరిశీలించారు. గ్రామంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలు ఎక్కడైనా ఉంటే ప్రదేశాలు ఎక్కడైనా ఉన్నాయా అని పరిశీలించారు. డెంగీ జ్వరం వల్ల కలిగే దుష్ప్రరిణామాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ ఖాదర్ బాషా, సూపర్‌వైజర్ సైదా, హెల్త్ సిబ్బంది ఉన్నారు.

గంగమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-కావలి : మండలంలోని రాజువారి చింతలపాలెంలో మంగళవారం జరిగిన గంగమ్మ పొంగళ్ల కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎంఎల్‌ఎకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. గంగమ్మను దర్శించుకున్న ఎంఎల్‌ఎ కావలి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : ప్రభుత్వ పాలిటెక్నిక్ రుద్రకోట కళాశాలలో మంగళవారం రోటరీక్లబ్ ప్రెసిడెంట్ ఎస్.స్వర్ణలత, రెడ్‌క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ చీఫ్‌గెస్ట్‌గా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచడం ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థులకు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్‌ను తెలుసుకునే కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో విద్యార్థులు, ప్రిన్సిపాల్, సిబ్బంది వారితో మొక్కలు నాటే ప్రోగ్రాంను ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియ తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిర్వాహకులు మాధవ రెడ్డి, నల్లూరు రవికుమార్, రమేష్ రెడ్డి, సురేష్, హరి నారప రెడ్డి, పోబ్బా సాయివిటల్, టీం సేవియర్ సభ్యులు ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అద్దంకి శరశ్చంద్రిక అనునాకు చెందిన నెం. U3282109 (తే18-06-2020ది) రు గల ఒరిజినల్ పాస్ పోర్టు తే20-07-2024ది న కావలి నుండి బోగోలుకు బస్సులో పోవుచుండగా బస్సులో పోయినది. దొరికినవారు నాకు చేర్చగలరు.

ఇట్లు
అద్దంకి శరశ్చంద్రిక
సెల్ : 94902 79028

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI
MCOP No. 2155 OF 2023

Bommu Suneel ...petitioner
VS
1. Narasimha Rao
2. United India Insurance Co, Ltd
...Respondents

To
N.Narasimha Rao S/o Narasaiah D.No.6/12, Ashok Nagar, Navalak Garden, Nellore, Andhra Pradesh-524002
....1st Respondent

Take notice that the above case is posted to 27.08. 2024 at 10.30 am Before the Hon'ble Vth judge of Small causes Court, Chennai, for your appearance, in person or through pleader, without fail or otherwise the matter will be decided In your absence.

MR.R.RAMKUMAR
ADVOCATE, CHENNAI
Counsel for the Petitioner

నోటీసు
అండర్ ఆర్డర్-5, రూల్ 1 & 5 ఆఫ్ సివిల్ ప్రొవిజన్ కోడ్
మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 129 / 2023

వేమూరి చిన్న నాగేశ్వర రావు – వాది
V/s
అర్కిటేముల వెంకటేశ్వర్లు – ప్రతివాది

టు,
అర్కిటేముల వెంకటేశ్వర్లు, తండ్రి **మాలకొండయ్య,** ఖాది ఆఫీసు దగ్గర, కందుకూరు పట్టణము & మండలం, పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుతం ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరు వ్యవహారంలోని వాది, తనకు మీ వద్ద నుండి రావలసిన ప్రామిసరి నోటు బాకీని రాబట్టుకొనుటకు గాను పై దావా దాఖలు పరచగా సదరు వ్యవహారములో మీరు ప్రతివాదిగా ఉన్నారు. కనుక పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం మీకు నోటీసులు పంపించినను సదరు నోటీసులు మీకు జారీ కానందున, పై కోర్టు వారు మీకు నోటీసులు ఈ ప్రకటన ద్వారా జారీ చేయమని పై కేసును **తేది: 23-08-2024** నకు వాయిదా వేసియున్నారు. కావున **తేది: 23-08-2024** న **ఉదయం గం॥ 10.30 నిముషములకు** మీరు స్వయంగా కాని, లేక మీ తరపు న్యాయవాది ద్వారా కాని పై కోర్టు నందు హాజరు పడి మీరు తెల్పుకోవలసిన ఆక్షేపణలను తెల్పుకోవలెను. లేనియెడల పైకోర్టు వారు పై వ్యాజ్యమును మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

ఇట్లు
పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
షేక్. మస్తాన్ వలి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
వాదితరపు న్యాయవాది
కందుకూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.
సెల్: **98489 58533**